సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం : 21 : జూలై : 2023



ప్రైవేటులో ఫీ'జులుం'..!

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మూడు జూనియర్ కాలేజీలకు ఇంటర్ **బోర్డు నోటీసులు జారీ చేసింది.**

8లో



హైలో.. హైలెస్సా..!

10లో

మత్స్యకారుల దశాబ్దాల కలను సాకారం చేసి.. వారి జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



ప్రకృతి వైద్యం.. పునర్ వైభవం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారు.

10లో

న్యూస్‌రీల్

కృష్ణా కళాశాలలో నేడు, రేపు మెగా జాబ్‌మేళా



మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఈ నెల 21, 22వ తేదీల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమ నిర్వహణపై గురువారం జేకేసీ కో-ఆర్డినేటర్లు, అధ్యాపకులతో సమీక్షించారు. రబ్బర్, కెమికల్, పెట్రో కెమికల్ తదితర రంగాల్లోని 15 ప్రముఖ కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయని.. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇది సువర్ణావకాశమన్నారు. 1,000 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ లక్ష్యంగా మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందని.. మధ్యాహ్నం 3 గంటలకు రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతుబజార్లకు 10 టన్నుల టమాటాలు



సీతమ్మధార: రైతుబజారుల్లో శుక్రవారం ఉదయం నుంచి కిలో రూ.50 చొప్పున సబ్సిడీపై టమాటాలు విక్రయించనున్నట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్‌యాసిన్ తెలిపారు. నగరానికి 10 టన్నుల టమాటాలు వచ్చాయని, ఆధార్/రేషన్ కార్డుపై మనిషికి కిలో చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సీతమ్మధారలో 60 కేట్లు, ఎంవీపీకాలనీలో 60 కేట్లు, నరసింహనగర్‌లో 40 కేట్లు, పెదవాల్తేరులో 20 కేట్లు, గోపాలపట్నంలో 50 కేట్లు, మర్రిపాలెంలో 30 కేట్లు, కంచరపాలెంలో 50 కేట్లు, పెందుర్తి 43 కేట్లు, మధురవాడ రైతుబజార్‌లో 43 కేట్లు టమాటాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు-2023 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విస్ సీఈవో సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్, రాజకీయం, ఎన్జీవోలు, లాభాపేక్ష లేని సంస్థలు/సంఘాలు తాము అందిస్తున్న సేవలను వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓ పేజీలో పూర్తి వివరాలు వెల్లడించి.. ప్రెస్ క్లిప్పింగ్‌లు, ఫొటోలు జతచేసి, చిరునామా, ఫోన్ నంబర్, ఈ మెయిల్‌ను ఆగస్టు 12లోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట, విశాఖపట్నంలో సమర్పించాలి. మరిన్ని వివరాలకు 0891-2558291లో లేదా కార్యాలయం పని వేళల్లో నేరుగా సంప్రదించవచ్చు.

భారతీయం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రజని, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మేయర్ హరి వెంకట కుమారి

మహారాణిపేట: కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని యాక్మీ స్వచ్ఛంద సంస్థ 'భారతీయం'పేరిట ఈ నెల 26న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కలెక్టర్ చాంబర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో 'భారతీయం' పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆవిష్కరించారు. కార్గిల్ అమరవీరుల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, యాక్మీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాప్, కార్యదర్శి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

23న సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

తగరపువలస: విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న అండర్-13 సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వీడీఎఫ్ఏ కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31 మధ్య జన్మించిన బాలబాలికలు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చు. కొమ్మాదిలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని విజ్డస్ టీం మైదానంలో ఎంపికలు జరుగుతాయి. మరిన్ని వివరాలకు 92481 43143, 96521 91905లో సంప్రదించవచ్చు.

స్వచ్ఛ సాగరం



విశాఖ సాగరతీరం.. మరింత స్వచ్ఛతను సంతరించుకోనుంది. పర్యాటకులు ఆహ్లాదం, ఆనందాన్ని పంచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే బీచ్‌రోడ్డును అభివృద్ధి చేస్తున్న గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ).. ఇక నుంచి సాగర తీరాన్ని ప్రతిరోజూ శుభ్రపరిచేందుకు క్లీనింగ్ యంత్రాలను వినియోగించనుంది.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



బీచ్ క్లీనింగ్‌కు ఉపయోగించే యంత్రమిదే..

- ప్రతి రోజూ బీచ్ క్లీనింగ్
- ఆరు చోట్ల ప్రత్యేక యంత్రాల వినియోగం
- మురుగునీరు సముద్రంలో కలవకుండా చర్యలు
- రూ.3.01కోట్లతో డ్రై వెదర్ ఫ్లో సిస్టం ఏర్పాటు

జీవీఎంసీ పరిధిలో మొత్తం 33 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి మధ్యలో ఉన్న బీచ్‌లకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. పర్యాటకులకు మరింత ఆహ్లాదం అందించేందుకు యంత్రాల ద్వారా బీచ్‌లను శుభ్రపరచనున్నారు. ముంబయి, గోవా, చెన్నై, థానే తదితర ప్రాంతాల్లో వినియోగిస్తున్న ఈ యంత్రాలు.. ఇక మీదట విశాఖ తీరంలోనూ దర్శనమివ్వనున్నాయి. మరోవైపు కాలువల ద్వారా సముద్రంలోకి చేరుతున్న వ్యర్థాలకు అడ్డుకట్ట వేసేందుకు జీవీఎంసీ నడుం బిగించింది. డ్రై వెదర్ ఫ్లో విధానంలో కాలువల ద్వారా వస్తున్న వ్యర్థాలను సమీపంలోని మురుగునీటి శుద్ధిప్లాంట్(ఎస్‌టీపీ)లోకి మళ్లించనున్నారు. ఇందుకోసం రూ.3.01కోట్లతో మూడు ప్రాంతాల్లో డ్రై వెదర్ ఫ్లో విధానాన్ని అమలు చేయనున్నారు.

బీచ్‌లు తళతళలాడేలా..

సముద్ర గర్భంలో పేరుకుపోయిన వ్యర్థాలు అలల ద్వారా ఒడ్డుకు చేరుకుంటాయి. పర్యాటకులు కూడా వాటర్ బాటిల్స్, తినుబండారాల వ్యర్థాలను తీరంలో పడేస్తుంటారు. దీంతో సాగర తీరం వ్యర్థాల కుప్పగా మారిపోతోంది. పలు సంస్థలు, జిల్లా యంత్రాంగం తరచూ బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు చేపడుతున్నా.. పూర్తి స్థాయిలో వ్యర్థాలు తొలగించలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ఆర్.కె.బీచ్, సాగర్‌నగర్ బీచ్, తెన్నేటిపార్క్, రుషికొండ, భీమిలి బీచ్‌ల వద్ద కొత్తగా బిల్డ్, ఓన్, ఆపరేట్ (బీవోవో) పద్ధతిలో ఐదు బీచ్ క్లీనింగ్ యంత్రాలతో పాటు వాటి నిర్వహణ బాధ్యత మొత్తం ఓ ప్రైవేట్ సంస్థ చూస్తుంది. 2026 వరకు నిర్వహణకు వీలుగా రూ.96 కోట్ల వ్యయంతో జీవీఎంసీ ఈ పనులను అప్పగించింది. తద్వారా ఆయా బీచ్ ప్రాంతాల్లో ఇక నుంచి ప్రతిరోజూ క్లీనింగ్ ప్రక్రియ కొనసాగనుంది. అలాగే మరో బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని కూడా 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసేందుకు జీవీఎంసీ సిద్ధమైంది.

మూడు ప్రాంతాల్లో డీడబ్ల్యూఎఫ్ సిస్టం

కాలువల నుంచి వచ్చే మురుగునీరు నేరుగా సముద్రంలో కలవకుండా జీవీఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు మొత్తం 34 వరద నీటి కాలువల నుంచి మురుగు నీరు సముద్రంలోకి చేరుతోందని అధికారులు గుర్తించారు. ఇక నుంచి ఈ కాలువల నుంచి వస్తున్న మురుగునీటిని శుద్ధి చేసిన తర్వాతే సాగరంలో కలపనున్నారు. మొదటి విడతలో 24 కాలువల ద్వారా వచ్చే నీటిని నేరుగా సముద్రంలో కలవకుండా డ్రై వెదర్ ఫ్లో(డీడబ్ల్యూఎఫ్) విధానాన్ని అమలు చేయనున్నారు. ఇందుకోసం రూ.1.05 కోట్ల వ్యయంతో బుక్కవీధి కోస్టల్ బ్యాటరీ వద్ద ఉన్న నేవల్ క్వార్టర్స్‌కు ఎదురుగా, రూ.1.16 కోట్ల వ్యయంతో ఊటగెడ్డ వద్ద, రూ.80 లక్షల వ్యయంతో సాగర్‌నగర్ వద్ద డీడబ్ల్యూఎఫ్ సిస్టంను జీవీఎంసీ ఏర్పాటు చేస్తోంది.

ముఖ్యమంత్రి ఆదేశాలతో..



వ్యర్థాలు లేకుండా ఎల్లప్పుడూ సముద్ర తీరం స్వచ్ఛంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇందులో భాగంగా బీచ్ క్లీనింగ్ యంత్రాలను వినియోగించాలని నిర్ణయించాం. మొత్తం ఆరు ప్రాంతాల్లో బీచ్ క్లీనింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిరోజూ బీచ్‌ను శుభ్రపరచనున్నాం. తద్వారా పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని విశాఖ సముద్రతీరం పంచనుంది.

– సాయికాంత్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా కోలా గురువులు



సాక్షి,విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా కోలా గురువులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2008లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కోలా గురువులు 2012లో వైఎస్సార్ సీపీలో చేరారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉంటూ.. 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. అలాగే చోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు. ఇటీవలే డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులును సీఎం జగన్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించి విధేయతకు పట్టం కట్టారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

మత్స్యకార కులానికి చెందిన తనను డీసీసీబీ చైర్మన్‌గా, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డికి కోలా గురువులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.

అభివృద్ధి పరుగులు

గాజువాక, విశాఖ ఉత్తర నియోజకవర్గాలపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, చిత్రంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్ వర్మ

సాక్షి,విశాఖపట్నం: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా నిర్దేశించుకున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం గాజువాక, విశాఖ ఉత్తర నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమంపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి ఆమె సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టిగా సమస్యలపై చర్చించి.. వాటికి తక్షణ పరిష్కారం చూపేందుకు జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంపై సమీక్ష నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమైన పనులను శీఘ్రగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. ఇందులో భాగంగానే జిల్లాలో గాజువాక నియోజకవర్గం నుంచి సమీక్ష ప్రారంభించినట్లు చెప్పారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

యూజీడీ సమస్యకు పరిష్కారం

గాజువాక నియోజకవర్గానికి సంబంధించి రెవెన్యూ, జీవీఎంసీ, నాడు-నేడు, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి విడదల రజని సమీక్షించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్లు అక్కడ జరుగుతున్న పనులు, అపరిష్కృత సమస్యలను మంత్రి, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ మల్లికార్జున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నియోజకవర్గ అభివృద్ధిని వివరించారు. జీవో నం. 301 ద్వారా 7,228, జీవో నం.388 ద్వారా 1,225 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్ డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టామన్నారు. పరవాడ మండలంలో ఫార్మాసిటీ కోసం భూమి కోల్పోయిన వారు ఇళ్ల పట్టాలు కోరగా.. 134 మందికి పట్టాలు అందించినట్లు వివరించారు. అగనంపూడిలో రైతుబజార్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సీసీఎల్ఏకు పంపించామన్నారు. యారాడలో మోకాస గ్రామ భూముల వ్యవహారం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. తదుపరి ఆదేశాలు వచ్చిన తర్వాత చర్యలు చేపడతామని వివరించారు. పెదగంట్యాడ పీహెచ్‌సీ కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చేందుకు వైద్యారోగ్య శాఖకు ప్రతిపాదనలు పంపామన్నారు. నాడు-నేడు ద్వారా ఫేజ్-2 లో భాగంగా 62 పాఠశాలల్లో రూ.20 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం పనుల్లో భాగంగా 20 వార్డుల్లో రూ.5 కోట్లతో 48 పనులు ప్రారంభించినట్లు చెప్పారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఎమినిటీస్ కార్యదర్శుల పర్యవేక్షణలో సీసీఎంఎస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఆగస్టు చివరి నాటికి అన్ని వీధి దీపాలకు మరమ్మతులు చేపడుతామన్నారు. మంచినీటి సరఫరా విభాగంలో మోటార్ల సమస్య ఉందని.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి అవసరమైతే జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గాజువాక-కణితి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామన్నారు. గాజువాకలో యూజీడీ సమస్య అధికంగా ఉందని ఎమ్మెల్యే చెప్పగా.. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

వాంబే కాలనీల్లో ఇళ్లకు మరమ్మతులు

విశాఖ ఉత్తర నియోజకవర్గ సమీక్షలో... నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తీసుకెళ్లారు. ముందుగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ నియోజకవర్గంలో జీవో నం.388 ద్వారా 387 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్ డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. యూఎల్‌సీ భూముల రెగ్యులరైజేషన్ కోసం ఇప్పటి వరకు 164 దరఖాస్తులు మాత్రమే అందాయని, మిగిలినవారు ముందుకొస్తే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. పట్టాభిరామిరెడ్డి తోటలో రజక కుటుంబాలకు ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనల ఫైల్ ప్రభుత్వానికి పంపామన్నారు. వైద్యారోగ్య శాఖ నాడు-నేడులో భాగంగా రూ.6.31 కోట్లతో 7 కొత్త యూపీహెచ్‌సీలు నిర్మించినట్లు తెలిపారు. రూ.6.81 కోట్లతో ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మరమ్మతులు చేపట్టామన్నారు. ఫేజ్-1లో భాగంగా రూ.3.5 కోట్లతో పాఠశాలల్లో నాడు-నేడు పనులు చేపట్టినట్లు వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం పనుల్లో భాగంగా 18 వార్డుల్లో 46 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. తాటిచెట్లపాలెం, కంచరపాలెం, అక్కయ్య పాలెం, మాధవధారలోని వాంబే ఇళ్ల మరమ్మతులకు రూ.3.10 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మాధవధారలో ఇండోర్ స్టేడియం, రైతుబజార్, యూపీహెచ్‌సీ నిర్మాణానికి భూమిని గుర్తించాలని మంత్రి రజని కలెక్టర్‌కు ఆదేశించారు. ఎన్‌జీజీవో కాలనీలోని యూపీహెచ్‌సీని 10 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటీఎస్ కోసం 400 మంది డబ్బులు చెల్లించారని తెలపగా.. వారం రోజుల్లోగా దీనిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని కలెక్టర్ ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 రోడ్ల పనులను రూ.19.56 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు.

అందరి చేతికి వజ్రాయుధం

- మహా యజ్ఞంలా ఓటరు సవరణ ప్రక్రియ
- ఓటు కనిపించకపోతే వెంటనే ఫిర్యాదు చేయండి
- 7 నియోజకవర్గాల్లో 18 హెల్ప్‌డెస్క్‌లు
- కలెక్టరేట్‌లో మరో హెల్ప్‌డెస్క్, టోల్‌ఫ్రీ నంబర్
- జిల్లా సహాయ ఎన్నికల అధికారి, డీఆర్వో శ్రీనివాసమూర్తి



సాక్షి, విశాఖపట్నం : జిల్లా పరిధిలో ఏ ఒక్కరి ఓటు కనిపించలేదని భావిస్తున్నా వారు నేరుగా సంబంధిత బూత్ లెవల్ అధికారికైనా, ఏ ఒక్క ఎన్నికల అధికారికైనా ఫిర్యాదు చేస్తే.. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా సహాయ ఎన్నికల అధికారి, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి స్పష్టం చేశారు. తమ ఓటు హక్కు తెలుసుకునేందుకు అనేక మార్గాలున్నాయని సూచించారు. కలెక్టర్ డా.మల్లికార్జున మార్గదర్శకాల మేరకు ఈ నెల 21 నుంచి నెల రోజుల పాటు ఓటరు సవరణ ప్రక్రియను మహాయజ్ఞంలా నిర్వహించబోతున్నామని తెలిపారు. ఓటర్లకు ఏ సమస్య ఉత్పన్నమైనా ఫిర్యాదు చేసేందుకు జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 18 హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. స్పెషల్ సమరీ రివిజన్-2024(ఎస్ఎస్ఆర్) ప్రక్రియ గురించి డీఆర్వో ఇంకా ఏమన్నారంటే...

మూడు ఫారాలని వినియోగించుకోవాలి

ఓటరు నమోదు ప్రక్రియ, సవరణలకు సంబంధించి మూడు ఫారాల్ని ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చింది. 17 ఏళ్లు నిండిన వారు భవిష్యత్తు ఓటరుగానూ, 18 సంవత్సరాలు నిండిన వారు యువ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇందుకోసం ఫారం-6 అందించాలి. మరణించిన వారి ఓటు, ఎవరైనా ఓటరును జాబితా నుంచి తొలగించేందుకు ఫారం-7 నింపాలి. ఓటరు కార్డు బదిలీ చేసేందుకు, ఇంటి చిరునామా మార్చుకునేందుకు కొత్త ఓటరు ఫొటో గుర్తింపు కార్డు, ఓటరు జాబితాలో సవరణ, వైకల్యం ఉన్న వ్యక్తిగా గుర్తించేందుకు అభ్యర్థించేందుకు ఫారం-8 నింపాలి. ఈ మూడు కూడా ఇంటింటికీ సర్వేకు వచ్చే బీఎల్‌వోల వద్ద ఉంటాయి. ఓటర్లంతా వీటిని వినియోగించుకోవాలి.

ఒకే బూత్‌లో ఓట్లు ఉండేలా..

గతంలో ఒక కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు పోలింగ్‌బూత్‌లలో ఓటు ఉందనే ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. ఇకపై ఆ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ సూచనల మేరకు ఒక కుటుంబంలోని ఓట్లను వేర్వేరు బూత్‌ల పరిధిలో ఉండకుండా విభజన చేపట్టనున్నాం. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్, రీ ఎరేంజ్‌మెంట్స్ ప్రక్రియ జరగనుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూరల్ పరిధిలో ప్రతి బూత్‌లో 1500, అర్బన్ పరిధిలో 1200 మంది ఓట్లకు మించి ఉండకుండా చూడాలి. ఈ విభజన క్రమంలో కుటుంబ సభ్యుల ఓట్లు తారుమారవుతాయి. ఆ సమయంలో వారు దరఖాస్తు చేసుకుంటే ఏ బూత్‌లో ఉండాలని కోరుకుంటే ఆ బూత్‌కు అడ్జెస్ట్ చేస్తాం.

ఓటరు నిర్ణయం

ఓటరుకు రెండుచోట్ల ఓటు ఉంటే దేనిని తొలగించాలో సదరు ఓటరు వద్దనే అభిప్రాయం తీసుకోవాలని బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాల్లో స్పష్టం చేశాం. ముందుగా ఓటరుకు నోటీసు ఇచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం. అదేవిధంగా చనిపోయినవారి ఓటు తీసేయాలంటే ఆ కుటుంబానికి నోటీసు ఇస్తాం. డెత్ సర్టిఫికెట్ ఆధారంగానే సదరు ఓటును తొలగిస్తాం. మీ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలంటే.. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో గానీ, ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్‌ని వినియోగించి తెలుసుకోవచ్చు.

హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

ఓటరు నమోదులో ఏదైనా సమస్య తలెత్తితో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. కలెక్టరేట్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. 0891-2789798 నంబర్‌కు లేదా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 18 హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఇంటింటికీ ఓటరు సర్వే

- ఓటరు సర్వేకు రాజకీయ పార్టీలు సహకరించాలి
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కోరారు. గురువారం గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు బీఎల్‌వోల ద్వారా ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించిన వివరాలను బీఎల్‌వోలు సేకరిస్తారని తెలిపారు. గుర్తింపు పొందిన పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బీఎల్‌వోలను నియమించుకొని ఓటర్ల జాబితాను సవరించినప్పుడు వారు కూడా బీఎల్‌వోకు సహకరించేటట్టు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నామినేషన్లకు 10 రోజుల ముందు వరకు ఓటర్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ఓటరు హెల్ప్ లైన్ మొబైల్ యాప్ కాని డబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో కాని తనిఖీ చేసుకోవచ్చన్నారు. అనంతరం పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కృష్ణకాంత్(వైఎస్సార్ సీపీ), పాసర్ల ప్రసాద్(టీడీపీ), విజయానందరెడ్డి(బీజేపీ),సోడదాసు సుధాకర్(కాంగ్రెస్), బోని కృష్ణ(బీఎస్పీ), డాక్టర్ షీతల్ మదన్(ఆమ్ ఆద్మీ పార్టీ) తదితరులు పాల్గొన్నారు.

అరకోటి విద్యుత్ చౌర్యం..!

గుర్తించి నోటీసులు జారీ చేసిన ఈపీడీసీఎల్

సాక్షి, విశాఖపట్నం : వెయ్యి కాదు.. పది వేలు కాదు.. ఏకంగా అరకోటి విలువైన విద్యుత్‌ని అక్రమంగా వినియోగించుకుంది ఓ సంస్థ. ఆలస్యంగా గుర్తించిన ఈపీడీసీఎల్ అధికారులు సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు. వరాహ లక్ష్మీనరసింహస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్.. దరఖాస్తు మేరకు 2020 జూన్ 20న 11కేవీ సామర్థ్యం ఉన్న కనెక్షన్‌ని ఈపీడీసీఎల్ కేటాయించింది. బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా 2022 సెప్టెంబర్ 3న నోటీసులు ఇచ్చారు. మొత్తం రూ.6,68,386 చెల్లించని కారణంగా కనెక్షన్ నిలుపుదల చేశారు. అయినా బిల్లు చెల్లించకపోవడంతో 2023 జనవరి 7న ట్రస్టుతో అగ్రిమెంట్‌ని ఈపీడీసీఎల్ టెర్మినేట్ చేసింది. బకాయిలతో కలిసి మొత్తం రూ.10.26 లక్షలు చెల్లిస్తేనే కనెక్షన్ పునరుద్ధరిస్తామని మరోసారి నోటీసులు జారీ చేసింది. దీంతో ఆ సంస్థ రూ.9.47 లక్షలు ఈ ఏడాది ఏప్రిల్‌లో చెల్లించి కనెక్షన్ పునరుద్ధరించాలని ఈపీడీసీఎల్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధమైన ఈపీడీసీఎల్ అధికారులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. కనెక్షన్ తొలగించినా.. సదరు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మాత్రం అనధికారికంగా విద్యుత్‌ని వినియోగించుకున్నట్లు గుర్తించారు. 2022 సెప్టెంబర్ నుంచి ఏకంగా 1,82,428 యూనిట్లు వినియోగించినట్లు తేల్చారు. ఈ యూనిట్ల విద్యుత్ విలువ రూ.53,42,489గా గణించారు. దీనిపై స్పందించిన ఈపీడీసీఎల్ అధికారులు సదరు లక్ష్మీనరసింహ స్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు విద్యుత్ చౌర్యం నోటీసులతో పాటు ప్రొవిజినల్ ఎసెస్‌మెంట్ నోటీసులు కూడా జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

సిబ్బంది ప్రమేయముందా..?

సాధారణంగా ఒక ఇంటికి సంబంధించిన కనెక్షన్ తొలగిస్తే.. కనెక్షన్ పునరుద్ధరించాలంటే దరఖాస్తు పెట్టుకోవాలి. సంబంధిత ఇంజినీర్, లైన్‌మెన్ సమక్షంలో విద్యుత్ సరఫరా అందిస్తారు. కానీ 11కేవీ విద్యుత్ సరఫరా కట్ చేసినా.. సరఫరా పునరుద్ధరించుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానిక ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది సహకారం లేకుండా సరఫరా సాధ్యం కాదనేది స్పష్టమవుతోంది. స్థానిక లైన్‌మెన్ లేదా, ఇతర సిబ్బంది ఎవరైనా సహకరించారా అనే కోణంలోనూ ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. అయితే.. వీరిని తప్పించేందుకే విద్యుత్ చౌర్యం సదరు సంస్థే సొంతంగా చేసుకుందనే రీతిలో ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న ఒక ఉన్నతాధికారి కొమ్ముకాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్యాక్‌లాగ్ ఉద్యోగాల ప్రొవిజినల్ జాబితా విడుదల

మహారాణిపేట: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు సంబంధించిన ప్రొవిజినల్ సెలక్షన్ జాబితాను https://visakhapatnam.ap.gov.in/ లో పొందుపరిచినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి తెలిపారు. 2021-22లో 9 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా.. ప్రస్తుతం 5 పోస్టులకు మాత్రమే 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల అర్హతలను పరిశీలించిన తర్వాత ప్రకటించిన ఖాళీల మేరకు మాత్రమే తుది ఎంపిక జరుగుతుందన్నారు. బయట వ్యక్తుల మోసపూరితమైన మాటలు విని మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు. మరిన్ని వివరాలకు 0891-2952585ను సంప్రదించవచ్చు.

24 నుంచి ఐఐపీఈ 'హీరో' సదస్సు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు హైడ్రోజన్ శక్తి వనరులు, అవకాశాలు(హీరో)-2023పై సదస్సు జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి, ఏపీ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా ఆచార్యుడు జి.కె సూర్య ప్రకాష్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన సంస్థల నిపుణులు, విద్యావేత్తలు, చమురు ఇంధన రంగానికి చెందిన పరిశ్రమల నిపుణులు, భారత ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ప్రైవేటులో ఫీ'జులుం'..!

- అడ్డగోలుగా ఫీజులు వసూలు
- కాలేజీల్లోనే పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు
- రంగంలోకి దిగిన ఇంటర్‌బోర్డు అధికారులు
- ప్రైవేటు కాలేజీల్లో విస్తృత తనిఖీలు
- విశాఖలో మూడు కాలేజీలకు నోటీసులు

విశాఖ విద్య: నగరంలోని శ్రీనగర్‌లో గల ఎస్ఆర్ఐ కాలేజీలో భీమిలి కాపులుప్పాడకు చెందిన అన్నా చెల్లెలు ప్రవళ్లిక, మోహన్‌రావు ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. డిగ్రీలో చేరేందుకు సిద్ధమవ్వగా.. ఫీజు బాకీ పేరిట మోహన్‌రావు సర్టిఫికెట్లు కాలేజీ వారు తమ వద్దనే ఉంచుకొని, తనవి మాత్రమే ఇచ్చారని ప్రవళ్లిక చెబుతోంది. కాలేజీలో చేరిన తొలి రోజుల్లో చేసుకున్న ఒప్పందం ప్రకారం తాము ఫీజు మొత్తం కట్టేశామని, సర్టిఫికెట్లు లేనిది డిగ్రీలో ఎలా చేరాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇదే విషయమై బుధవారం ఆర్ఐవో సత్యనారాయణను కలసి తమ గోడు వెల్లబోసుకుంది.

● నగరంలోని నారాయణ కాలేజీలో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తుండటమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలను విక్రయిస్తున్నట్లు విద్యార్థులు ఫిర్యాదులు చేశారు. ఈ విషయం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దృష్టికి సైతం వెళ్లటంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు జరపకూడదని, వీటి కొనుగోలుకు విద్యార్థులపై ఒత్తిడి చేయడానికి వీల్లేదని హెచ్చరించారు.

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నగరంలోని నారాయణ విద్యా సంస్థలకు చెందిన రెండు జూనియర్ కాలేజీలు, ఎస్ఆర్ఐ కాలేజీ యాజమాన్యానికి ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ నోటీసులు జారీ చేశారు. ఇదే చివరి వార్నింగ్ అని, మరోమారు ఇలా చేస్తే గుర్తింపు రద్దు చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇలాంటి కాలేజీలపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాలతో రంగంలోకి దిగిన ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు, కాలేజీలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

సమగ్ర పరిశీలనతోనే 'గుర్తింపు'

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాల పరిధిలో 247 జూనియర్ కాలేజీలు నిర్వహిస్తున్నారు. అడ్మిషన్లు సవ్యంగా లేకపోవటంతో ఇందులో 20 కాలేజీలు మూతవేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేటు కాలేజీల నిర్వహణకు ప్రభుత్వం పరంగా గుర్తింపు ఇచ్చే విషయంలో ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా..? లేదా.. అనే దానిపై సమగ్ర పరిశీలన చేస్తున్నారు. ఇందుకోసమని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్ల అధ్యక్షతన నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. ఆర్ఐవో, డీవీఈవోల నేతృత్వంలోని కమిటీలు కాలేజీలను పూర్తి స్థాయిలో తనిఖీలు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటివరకు 64 కాలేజీలకు మాత్రమే ప్రభుత్వ పరంగా రెన్యువల్ కోసం గుర్తింపు ఇచ్చారు.

అడ్మిషన్లకు ఆటంకం లేకుండా..

ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ శరవేగంగా జరుగుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 366 జూనియర్ కాలేజీల్లో బుధవారం నాటికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 51,356 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా అన్ని కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టుకునేలా కొంత వెసులుబాటు కల్పించారు. అయితే జిల్లా కమిటీ తనిఖీ నివేదిక ఆధారంగానే ప్రవేశాలపై తుది నిర్ణయం తీసుకునేలా ఉన్నతాధికారులు నిబంధనలు పెట్టారు.



ఎస్ఆర్ఐ కాలేజీపై ఆర్ఐవోకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థిని ప్రవళ్లిక

ఒత్తిడికి గురిచేస్తే గుర్తింపు రద్దు చేస్తాం

ఫీజుల కోసమని విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తే.. కాలేజీల గుర్తింపు రద్దు చేస్తాం. ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు నారాయణ రెండు బ్రాంచిలు, ఎస్ఆర్ఐ కాలేజీలకు నోటీసులు జారీ చేశాం. కాలేజీల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు జరపడానికి వీల్లేదు. ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు కొనసాగుతాయి.

– రాయల సత్యనారాయణ, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

డీసీసీబీ చైర్మన్‌కు అభినందనలు

గోపాలపట్నం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులను ఆయన క్యాంప్ కార్యాలయంలో బ్యాంక్ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలతో అభినందించారు. బ్యాంక్ సీఈవో డి.వి.ఎస్.వర్మ, జనరల్ మేనేజర్లు, డీజీఎంలు ఏజీఎంలు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



డీసీసీబీ చైర్మన్ కోలా గురువులుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న సీఈవో డీవీఎస్ వర్మ, సిబ్బంది

నేడు కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి రాక

దొండపర్తి: కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ శుక్రవారం నగరానికి వస్తున్నారు. సాయంత్రం 5.10కి ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి నోవోటెల్ హోటల్‌కు వెళతారు. రాత్రి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 9.20 గంటలకు పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగే రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 3.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొని హైదరాబాద్‌కు పయనమవుతారు.

31లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఆస్పత్రులు, క్లినిక్‌లకు డీఎంహెచ్‌వో అల్టిమేటం

మహారాణిపేట: జిల్లాలోని ఆస్పత్రులు, క్లినిక్‌లు, డెంటల్ క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేని పక్షంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు https://clinicalesttact. ap.gov.in ను, స్కానింగ్ కేంద్రాలు https://pcpndt.ap. gov.in/ ను సందర్శించాలని సూచించారు. ఇదే చివరి అవకాశంగా భావించి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు.

సెంచురీ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తా

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని సెంచురీ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. క్లబ్ ఆవరణలో రూ.1.50 కోట్లతో పునర్నిర్మిస్తున్న భవనానికి గురువారం మంత్రి అమర్‌నాథ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ క్లబ్‌కు 90 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. క్లబ్ నిర్వహణ కోసం కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. క్లబ్‌కు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని పూర్వ అధ్యక్షుడు దంతులూరి దిలీప్ కుమార్ మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.



భూమి పూజ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

రవిరెడ్డి కుటుంబానికి పరామర్శ

కొమ్మాది: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుడిమెట్ల రవిరెడ్డి కుటుంబాన్ని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి పరామర్శించారు. సాగర్‌నగర్‌లోని ఆయన నివాసానికి గురువారం చేరుకుని.. రవిరెడ్డి తండ్రి సత్తిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ముఖ్యనేత వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు రవిరెడ్డిని పరామర్శించారు.



సత్తిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తదితరులు

ఏఐహెచ్‌ఆర్‌పీసీ నేషనల్ డైరెక్టర్‌గా శంషద్ బేగం

గోపాలపట్నం: ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్(ఏఐహెచ్‌ఆర్‌పీసీ) హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ విభాగం నేషనల్ డైరెక్టర్‌గా శంషద్ బేగం నియమితులయ్యారు. గతంలో ఏఐహెచ్‌ఆర్‌పీసీహెల్త్ అండ్ ఫ్యామిలీ విభాగంలో ఆమె పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ 90వ వార్డు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు. ప్రజల హక్కులు కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.



శంషద్ బేగం

కోల్ ఇండియా చైర్మన్‌తో స్టీల్‌ప్లాంట్ సీఎండీ భేటీ

ఉక్కునగరం: కోల్ ఇండియా చైర్మన్ పి.ఎం.ప్రసాద్‌ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ గురువారం కలిశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతితో కలిసి ఆయన కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా కోల్ ఇండియా, స్టీల్‌ప్లాంట్ మధ్య సంబంధాల బలోపేతం గురించి చర్చించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తికి అంతరాయం కలగకుండా అవసరమైన కోకింగ్ కోల్, థర్మల్ కోల్ సరఫరా చేయాలని కోరారు.



కోల్ ఇండియా చైర్మన్ ప్రసాద్‌కు బొకే అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

ఉత్సాహంగా 'బీవోబీ' వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్.కె.బీచ్‌లో నిర్వహించిన వాక్‌థాన్ ఉత్సాహంగా సాగింది. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను సుందర నగరంగా తీర్చిదిద్దే క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా తమకు పూర్తి సహాయ సహకాలు అందిస్తోందన్నారు. బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పీఎం ప్రధాన్ మాట్లాడుతూ తమ బ్యాంకు దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించిందన్నారు. ఎల్లవేళలా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ 116వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందన్నారు. ఎకో వైజాగ్‌లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో బ్యాంక్ వ్యవస్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈపీడీసీఎల్ సీఎండీ ఇమడి పృథ్వీతేజ్, జూనియర్ చెస్ చాంపియన్ కోలగట్ల ఆలనా మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు